సాక్షి
గుంటూరు
గురువారం । 12 । జనవరి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 822 క్యూసెక్కులు వదులుతున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సీఆర్‌డీఏ విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా విజయ్‌కుమార్



మంగళగిరి: సీఆర్‌డీఏ విద్యుత్ శాఖ ఎస్‌ఈగా డాక్టర్ ప్రత్తిపాటి విజయ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అమరావతి డివిజన్ ఈఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయ్‌కుమార్ ఉదోగోన్నతిపై సీఆర్‌డీఏ ఎస్‌ఈగా నియమితులయ్యారు. బుధవారం రాయపూడిలోని సీఆర్‌డీఏ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా పలువురు విద్యుత్‌శాఖ అధికారులు అభినందనలు తెలిపారు. విజయవాడ టీపీఎస్‌ఎస్ ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న టీవీ తులసీరామ్ అమరావతి ఈఈగా బుధవారం బాధ్యతలు చేపట్టగా డీఈఈ అక్కల సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

నేడు వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టు దుర్గ కాలినడక

పెదకాకాని: జాతి సమైక్యత కోరుతూ వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టూ దుర్గ కాలి నడక నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం 5:30 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గ నుంచి నడక ప్రారంభమవుతుందన్నారు. 1500 మంది విద్యార్థులతో 33 కిలోమీటర్లు మేర ఈ కాలినడక కొనసాగుతుందని తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 576.50 అడుగుల వద్ద ఉంది. ఇది 272.9955 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,500, ఎడమకాలువకు 8,541, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,761 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 20,761 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది. ఇది 83.9086 టీఎంసీలకు సమానం.

యార్డుకు 65,627 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 65,627 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 60,259 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.28,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.13,500 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.13,000 నుంచి రూ.20,000 వరకు ధర పలికింది.

సంక్రాంతి.. దోపిడీ

- ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్
- ఆన్‌లైన్‌లో రెండు రకాల టికెట్ రేట్లు
- మాన్యువల్ అయితే.. మరింత దోపిడీ
- మామూళ్ల మత్తులో ఆర్టీఓ కార్యాలయ అధికారులు
- సమావేశాలతో సరిపెడుతున్న వైనం
- నిబంధనలు విస్మరించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలుపుదల

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డుఅదుపూ లేకుండా దోచుకుంటున్నాయి. నిబంధనలను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 150 వరకు ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతోపాటు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు తరలివస్తున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ధరలకు అనుగుణంగానే టికెట్ ధరలు ఉండాలనే రవాణాశాఖ అధికారుల సూచనలను ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఖాతరు చేయని పరిస్థితులు కనపడుతున్నాయి.

బుక్ చేస్తే.. మరో ధర

ప్రైవేట్ ట్రావెల్స్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు అనేక రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆ యాప్‌లు ఓపెన్ చేయగానే ఒక ధర.. అన్ని ఆప్షన్స్ పూర్తి చేసిన తర్వాత బుక్ చేసుకునే సమయానికి మరో ధర వస్తోంది. మంగళగిరికి చెందిన ఓ విద్యార్థిని పండుగ నిమిత్తం బెంగళూరు నుంచి సొంత ఊరికి వచ్చేందుకు టికెట్ బుక్ చేసుకుంది. ముందు టికెట్ ధర రూ 1700 చూపించిన క్రమంలో బుక్ చేసే సరికి రూ.2400 అయింది. ఇంచుమించుగా యాప్‌ల్లో ఇదే పరిస్థితి కనపడుతోందని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లోనే ఇదే విధంగా వ్యవహరిస్తే.. సాధారణంగా ఒక కార్యాలయానికి వెళ్లి టికెట్ బుక్ చేసుకునే వారి పరిస్థితి ఇక చెప్పాల్సిన పనిలేదు.



ఓ ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయం వద్ద ప్రయాణికులు

ఆర్టీఓ అధికారులు సూచించిన ధరల కంటే అధికంగా దోచుకుంటున్నారు.

సమావేశాలకే పరిమితం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపట్టాల్సిన ఆర్టీఓ అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధిక ధరలతో ప్రయాణికులను దోపిడీ చేస్తున్నా.. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు చేస్తున్నామని పేరుకే తప్ప.. ఎక్కడా పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోటార్ వెహికల్ నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల లోపు ప్రైవేట్ బస్సులు ఉండకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఆర్టీఓ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే వాదనలు లేకపోలేదు. మంగళవారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాయంత్రం సమయంలో ప్రైవేట్ బస్సుల వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నప్పటికీ కనీసం ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవటం గమనార్హం.



ఒకే టికెట్‌లో రెండు రకాల రేట్లు చూపిస్తున్న పరిస్థితి

ధరల వివరాలు ఇలా...

ఏపీఎస్ఆర్టీసీ టికెట్ ధరలకు అనుగుణంగా ప్రైవేట్ ట్రావెల్స్ ధరలు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి.

	(ఆర్టీసీ)	ప్రైవేట్ ట్రావెల్స్
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు		
నాన్ ఏసీ	రూ.500	రూ.900
ఇంద్ర	రూ.670	ఏసీ రూ.1500పైగా
అమరావతి	రూ.940	స్లీపర్ రూ.2000
బెంగళూరుకు		
ఏసీ రూ.1450		రూ.2500 నుంచి రూ.3వేలు
చెన్నై		
నాన్ ఏసీ రూ.700		--
ఏసీ రూ.950		రూ.1500

తనిఖీలు నిర్వహిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. మంగళగిరి టోల్ ప్లాజా, పేరేచర్ల మరిన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం, వాటిని మరింత ముమ్మరం చేస్తాం. స్పెషల్ డ్రైవ్ చేపట్టి అధిక ధరలకు టికెట్ విక్రయాలు లేకుండా చేస్తాం. ప్రయాణికులు సైతం అధిక ధరలు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకుని రావాలని కోరుతున్నాం.

– షేక్ కరీం, డీటీసీ

హంతకుడికి జీవిత ఖైదు

మార్టూరు: అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చిన భర్తకు బుధవారం ఒంగోలు కోర్టులో న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. ఎస్‌ఐ రవీంద్రారెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటివారిపాలెం గ్రామానికి చెందిన మెడబలిమి కోటమ్మను మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ప్రేమసాగర్‌తో 2011లో ద్వితీయ వివాహం జరిపించారు. అదే సంవత్సరం జూన్ 15 ఉదయం 8 సమయంలో ప్రేమ సాగర్ తాటి వారి పాలెంలోని తన భార్య పుట్టింట్లో అనుమానంతో హత్య చేశాడు. విచారణలో ప్రేమ సాగర్‌పై హత్యా నేరం రుజువు కావటంతో ఒంగోలు అడిషనల్ జూనియర్ కోర్టు జడ్జి డి. అమ్మని రాజా బుధవారం తీర్పు చెబుతూ నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానా విధించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేందుకు కృషి చేసిన పోలీసులను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఈఓ పి.శైలజ

గుంటూరుఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించిన దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని డీఈఓ పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిరు వ్యాపారులకు తోడుగా



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తఫా, డాక్టర్ శ్రీదేవి

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- 16,195 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో రూ.16.20 కోట్లు
- 32,783 మంది ఖాతాల్లో వడ్డీ రాయితీ రూ.82 లక్షలు జమ

గుంటూరువెస్ట్: తోపుడు బండ్లు, రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారికి, టైలర్స్ తీసుకున్న నగదుకు వడ్డీని సకాలంలో ప్రభుత్వమే చెల్లించి వారికి చేదోడుగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన జగనన్న తోడు 6వ విడత వడ్డీ రాయితీని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 16,195 మంది చిరు వ్యాపారులకు రూ.16.20 కోట్లు, 32,783 మందికి వడ్డీ రాయితీ కింద రూ.82 లక్షలు ముఖ్యమంత్రి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 67,811 మందికి రూ.67.79 కోట్ల రుణాలు మంజూరు చేయగా వడ్డీ రాయితీ కింద రూ.2.77 కోట్లు అందజేశామన్నారు. కనీస పెట్టుబడి లేని పేద, చిరు వ్యాపారులకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఈ మొత్తం ఎంతో మందికి జీవనాధారంగా మారిందన్నారు. ముఖ్యంగా మహిళల్లో పొదుపు చేసే లక్షణం ఎక్కువగా ఉంటుందని, ఈ చిన్న మొత్తంతోనే చక్కని వ్యాపారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ చిరు వ్యాపారులు, పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్న మొత్తం లేక ఎందరో ఉపాధికి దూరంగా ఉండే వారన్నారు. ఇప్పుడు అందిస్తున్న ఈ మొత్తంతో చాలా మంది మహిళలు వారి కుటుంబాలకు అండగా నిలబడగలుగుతున్నారని చెప్పారు. అందుకు పేదల గుండెల్లో ముఖ్యమంత్రికి ప్రత్యేక స్థానముందన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ మున్‌తాజ్ పఠాన్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ వెంకట నారాయణ అధికారులు పాల్గొన్నారు.

మెటీరియల్‌కు ఇబ్బంది లేదు



నేను టైలరింగ్ చేస్తుంటాను. జగనన్న తోడు ద్వారా రూ.10 వేలు రుణం తీసుకున్నాను. సకాలంలో బ్యాంకుకు జమ చేస్తున్నాను. వడ్డీ మాత్రం ప్రభుత్వమే చెల్లిస్తుంది. మాకు ఎంతో ఊరటనిస్తుంది. ఈ మొత్తంతో టైలరింగ్‌కు కావాల్సిన మెటీరియల్ కొనుక్కుంటున్నాను. నా కుటుంబానికి కొంత అండగా ఉండగలుగుతున్నాను...

– టి.భవాని, గుంటూరు.

కూడు..గూడు..గుడ్డ నినాదమే...

సీఎం జగన్ విధానం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి తదితరులు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): పేదవాడికి కావాల్సిన కూడు, గూడు, గుడ్డ అనే నినాదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విధానంగా మార్చుకుని ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు నగరంలోని కృష్ణబాబునగర్ ఎస్సీ కాలనీ వాసులకు బుధవారం జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం-వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం కింద ఇళ్ల పట్టాలు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చియార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, స్థానిక కార్పొరేటర్ షేక్ జుమ్మాబీ, మార్కెట్ బాబు పంపిణీ చేశారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఊరి మధ్యలో ఉన్న నిరుపేద దళిత కుటుంబాలను నిర్దాక్షిణ్యంగా ఊరి వెలుపలికి తరలించి వారి ఊసే మరిచి, ఉనికినే ప్రశ్నార్థకం చేసిందన్నారు. ఆనాడు బలవంతంగా పంపబడిన వారిలో కొందరు కృష్ణబాబునగర్ ఎస్సీ కాలనీలో నివాసాలు ఉంటున్నారన్నారు. తమ ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం వారు ఎక్కడైతే నివశిస్తున్నారో అక్కడే ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం తీసుకున్నట్లు చెప్పారు. ఇది ఒక్క కృష్ణబాబునగర్ ఎస్సీ కాలనీకి మాత్రమే పరిమితం కాదని, ఎక్కడెక్కడో నివసిస్తూ మిగిలిపోయిన అనేక మందికి కూడా త్వరలోనే ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ప్రగతిపథంలో పరుగులు తీస్తోందని, సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అమలౌవుతున్నాయన్నారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా ప్రజల సహకారంతోనే సంపూర్ణంగా విజయవంతం అవుతుందన్నారు. మిర్చియార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాటినే కాక చెప్పనివి కూడా చేసి చూపిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం కింద లబ్ధి పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, తహసీల్దార్ సాంబశివరావు, పార్టీ నేత గులాం రసూల్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు షేక్ రోషన్, గురవయ్య, సాంబిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉడతా కృష్ణ, 39వ డివిజన్ అధ్యక్షుడు షేక్ షఫి తదితరులు పాల్గొన్నారు.

కత్తి కడితే.. కటకటాలకే !

సంక్రాంతి అంటేనే రంగవల్లులు, పిండివంటలు, భోగిమంటలు, హరిదాసులు.. ఇలా తెలుగింటి సంస్కృతీ, సాంప్రదాయాలు గుర్తొస్తాయి. పండగ పూట సాయం సమయంలో కాస్తంత ఆటవిడుపుగా పలు ఆటలపోటీలు, పశువుల పోటీలు, కోడిపందేలు నిర్వహించడం అంతటా కనిపించేదే.. అయితే ఇదే అదనుగా గత కొన్నేళ్లుగా కోడి పందేల నెపంతో జూదం ప్రవేశించింది. అనేకుల జీవితాలతో చెలగాటమాడుతోంది. బరులు ఏర్పాటు చేసి మరీ ప్రజల జేబులు కొల్లగొడుతున్న పందెం రాయుళ్లకు కళ్లెం వేసేందుకు జిల్లా పోలీసులు నడుం బిగించారు.

కోడి పందేలపై పోలీసుల ఉక్కుపాదం

- ఇప్పటికే 968 మంది బైండోవర్
- జిల్లాలో 132 పందెం కోళ్లు స్వాధీనం
- 342 మంది జూదరులు అరెస్ట్
- బరులు ధ్వంసం చేసే పనిలో పోలీసులు నిమగ్నం



బాపట్లటౌన్: సంక్రాంతి సందడికి బాపట్ల జిల్లా ముస్తాబవుతోంది. పండుగ సంబరాల్లో భాగంగా కోడిపందేలు నిర్వహించే అవకాశం ఉండటంతో పోలీసులు వీటికి అడ్డుకట్ట వేసేందుకు సన్నద్ధం అయ్యారు. హైకోర్టు ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసులు ఇప్పటికే కొన్ని బరులను ధ్వంసం చేయడంతోపాటు పందేల నిర్వాహకులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి బైండోవర్ కేసులు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాల్లో మొత్తం 1276 మంది పాతనేరస్తులను గుర్తించి వారిలో ఇప్పటికే 968 మందిని బైండోవర్ చేశారు. మరో మూడు రోజుల్లో పండుగ హడావుడి ప్రారంభం కావడంతో పోలీసులు మరింత దూకుడు పెంచారు. స్టేషన్ల పరిధిలో కోడిపందేలు జరిగితే స్థానిక సీఐ, ఎస్ఐలే బాధ్యులవుతారని జిల్లా ఎస్పీ ఇప్పటికే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు జరగకుండా పూర్తి స్థాయి నిఘా పెట్టారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా ..

జిల్లాలో గతంలో ఇదే తరహాలో కోడి పందేలు నిర్వహించేవారిని, వారికి కోళ్లు, కత్తులు సరఫరా చేసేవారిని, పందేల సమయంలో కత్తులు కట్టేవారిని 1276 మందిని గుర్తించారు. వారిలో ఇప్పటికి 968 మందిని బైండోవర్ చేశారు. మిగిలిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మారుమూల గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే దాడులు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 67 కేసులు నమోదుచేసి వాటిల్లో 132 పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని 132 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 4,65,795 నగదుతోపాటు 69 వాహనాలను సీజ్‌చేశారు. తాజాగా బాపట్ల పట్టణంలో కోడి పందేల కోసం సిద్ధం చేస్తున్న కత్తుల తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి 250 కోడి కత్తులను, కత్తులు తయారుచేసే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కళ్లు కప్పి....

ఓ వైపు పోలీసుల నిఘా కొనసాగుతున్నప్పటికీ దొడ్డిదారిన కోడి పందేల నిర్వహణకు కొందరు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కోళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ దగ్గర పడటంతో నెమలి, కాకి, డేగ, అబ్రాసు, సీతువ, రసంగి, పర్ల, కొక్కిర వంటి జాతుల కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. పుంజు పొడుషన్ని, పోరాట తత్వాన్ని బట్టి రూ. లక్షల్లో ధర పలుకుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పందెం కోళ్ళకు శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో ఇప్పటికే 968 మంది బైండోవర్..

సర్కిల్ పేరు	గుర్తించిన జూదరులు	బైండోవర్ చేసినవాళ్లు	బైండోవర్ చేయాల్సినవాళ్లు
రేపల్లెటౌన్	79	78	01
రేపల్లె రూరల్	412	298	114
చుండూరు	26	22	04
వేమూరు	261	232	29
బాపట్లటౌన్	15	14	01
బాపట్లరూరల్	174	135	39
మార్టూరు	22	22	--
సంతమాగులూరు	13	11	02
చీరాల-2టౌన్	11	11	--
చీరాలరూరల్	108	52	56
ఇంకొల్లు	9	8	01
అద్దంకిరూరల్	49	49	--
అద్దంకి టౌన్	94	35	59
చీరాల-1 టౌన్	3	1	02
మొత్తం	1276	968	308

సాంప్రదాయ క్రీడలతో పండుగ జరుపుకోవాలి



సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్దంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి. జిల్లాలో కోడిపందేలు, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు. ఇప్పటికే 968 మందిని బైండోవర్ చేశాం. మిగిలిన వారిని త్వరలోనే బైండోవర్ చేస్తాం. కోడిపందేల కోసం కత్తులు సిద్ధం చేసేవారిపై నిఘా ఉంది. సాంప్రదాయ క్రీడలతో పండుగను జరుపుకోవాలి.

– జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1,600, గరిష్ఠ ధర రూ.2,100, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రజాప్రతినిధులు, అధికారులు

చేబ్రోలు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌లో బుధవారం శిక్షణ బ్యాచ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే హబ్‌లో 30 మంది శిక్షణ పొందగా 28 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వివరించారు. ఏపీఎస్ ఎస్‌డీసీ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో మొదటి విడతలో 64 నియోజకవర్గాల పరిధిలో స్కిల్ హబ్‌ల ద్వారా 2,340 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ ఎస్.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంకేవీ శ్రీనివాసులు, ఎంపీపీ సాహితి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ బి. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఒకరు ఇంజినీర్, మరొకరు డాక్టర్, ఇంకొకరు ప్రభుత్వ ఉద్యోగి... మరికొందరు వ్యాపారులు... ఇలా మదిలో మెదిలితే చాలు నా గుండెలో అంతా ఇంతా సంబరం కాదు. నా ఒడిలో అల్లరి చేస్తూ ఆటపాటలతో హుషారుగా గంతులేసే చిన్నారులు అంతా ఉన్నత స్థాయికి చేరారని నాకు గుర్తొచ్చినప్పుడల్లా ఎన్నిసార్లు ఉప్పొంగిపోయానే. ఏళ్ల క్రితం నా గుండె ఎదపైకి చదువులంటూ వచ్చిన విద్యార్థులు సంక్రాంతి పర్వదినం వేళ మళ్లీ నా చెంతకు వస్తున్నారని తెలిసినప్పటి నుంచీ నాకు కలిగిన సంతోషం మాటల్లో చెప్పలేను. ఒకే బెంచిపై, ఒకే క్లాసులో ఎన్నో మధురానుభూతులు పంచుకున్న బాల్యాన్ని మళ్లీ నాతో పంచుకోవాలని వారు తలచారని తెలిసిన వెంటనే ఆ అమృత ఘడియల కోసం చదువుల తల్లినైన నేను నా బిడ్డల కోసం ఎదురు చూస్తున్నాను. నా బిడ్డలను గుండెలకు హత్తుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాను. ఈ మహత్తర ఘట్టం కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన విద్యార్థులను మనసారా అభినందిస్తున్నాను.

– నూతక్కి అనపోతన జెడ్పీ హైస్కూల్

అవిగో అమృత ఘడియలు..

- 75 ఏళ్ల సంబరానికి ముస్తాబైన నూతక్కి హైస్కూల్
- దేశ, విదేశాల నుంచి తరలివస్తున్న పూర్వ విద్యార్థులు
- 13న సంక్రాంతికి మించిన సంబరం

తాడేపల్లి రూరల్: 1946వ సంవత్సరం... అప్పుడప్పుడే భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్న సమయం... బానిస సంకెళ్లు తెంచుకున్న ప్రజానీకం సరికొత్త పునరుజ్జీవం వైపు పయనించేందుకు సిద్ధమవుతున్న కాలం. ఈ సమయంలో ప్రజలకు జీవన విధానం మారేందుకు ఒకే మార్గం విద్య. ఈ విద్యా స్రవంతి వ్యాప్తికి మేము సైతమంటూ మారుమూల గ్రామమైన నూతక్కి ముందడుగు వేసింది. కనీసం ఎలిమెంటరీ స్కూల్ కూడా లేని ప్రాంతంలో ఏకంగా హైస్కూల్ నిర్మాణానికి కంకణం కట్టింది. అనుకున్నదే తడవుగా గ్రామస్తులంతా ఒకేమాట, ఒకే బాటపై నిలిచి అక్షర పునాదులు వేశారు. పాఠశాల శంకుస్థాపనకు ఎడ్యుకేషన్ బోర్డు గుంటూరు జిల్లా డైరెక్టర్ పాములపాటి వెంకట కృష్ణయ్యని పిలిపించారు. అలా పురుడుపోసుకున్న దేవాలయం ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎన్నో మైలురాళ్లను అందుకుంది. తొలి పదో తరగతి బ్యాచ్ 11 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. ఆ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ రాసిన 11 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.



పద్మాలను అందించిన విద్యా దేవాలయం

రెడ్డీస్ ల్యాబ్ అధినేత డాక్టర్ అంజిరెడ్డికి ఓనమాలు దిద్దించిన విద్యాలయం నూతక్కి జిల్లా పరిషత్ పాఠశాలే. 1958లో అంజిరెడ్డి ఇదే పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులయ్యారు. రెడ్డీస్ ల్యాబ్ స్థాపించి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ఇలా ఎందరో ఈ చదువులమ్మ ఒడిలో అక్షరాభ్యాసం చేసిన విద్యార్థులు ఈ రోజున ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఇప్పుడు వారంతా 75 ఏళ్ల తర్వాత ఒక్కసారి మళ్లీ చదువులమ్మ ఒడిలోకి చేరి అలనాటి జ్ఞాపకాల్లో తడిసి ముద్దయ్యేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. పిలుస్తోంది అమృతోత్సవం ఎంతో ఘన చరిత్ర ఉన్న నూతక్కి అనపోతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమృతోత్సవ సంబరాలు జనవరి 13వ తేదీన అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎందరో విద్యార్థులు అమృతోత్సవానికి హాజరు కావడానికి పూర్వ విద్యార్థుల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను సన్మానించడంతో పాటు, ఆత్మీయ సమ్మేళనంతో పూర్వ విద్యార్థులంతా చదువులమ్మ ఒడికి చేరుతున్నారు. సంక్రాంతి పండుగకు ముందే వస్తున్న ఈ అతిపెద్ద సంబరానికి నూతక్కి ముస్తాబవుతోంది. పాఠశాలతో అనుబంధమున్న ప్రతి ఒక్కరూ అమృతోత్సవానికి రావాలని పూర్వ విద్యార్థుల సంఘం తరఫున జె.ప్రసాదరెడ్డి, భీమిరెడ్డి శివారెడ్డి ఆహ్వానిస్తున్నారు.



వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు సిటీలో గాలి కాలుష్యం కాకుండా నాణ్యతను మరింత పెంచేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం నిధుల వినియోగం అమలు కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గాలి నాణ్యతకు సంబంధించి శాఖల వారీగా అధికారులు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలన్నారు. దీని కోసం బోర్డు నిధులు మంజూరు చేస్తుందన్నారు. గుంటూరు నగరాన్ని నాన్ అటెన్‌మెంట్‌గా ఎన్‌సీ ఏపీ గుర్తించిందన్నారు. వాయు కాలుష్య నివారణకు భారీ వాహనాల రాకను నిర్దిష్ట సమయాల్లోనే అనుమతించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాల ఇంజిన్స్ ఆపే విధంగా వాహన చోదకులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌ను నివారించాలన్నారు. నిర్దేశించిన దానికంటే ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలను గుర్తించి అపరాధ రుసుం వసూలు చేయడంతోపాటు వాటిని నియంత్రించాలన్నారు. సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాస్త్రవేత్త ఎస్.కార్తికేయ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాసరావు, జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం, పరిశ్రమల శాఖ జీఎం విజయరత్నం పాల్గొన్నారు.

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను నిర్దిష్ట కాలంలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాట్లాడారు. రబీ పంట ఈ–క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ ఈ నెల 13 నాటికి పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జరగకుండా పోలీసులు, రెవెన్యూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయాలకు వెళ్ళిన అర్జీలను 24 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పెదకాకాని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్, పీఈటీ సీహెచ్ కొండయ్య సూచించారు. మండలంలోని నంబూరు జెడ్పీ హైస్కూలులో బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్– 14, అండర్– 17 విభాగాలలో ముగ్గురు చొప్పున ఎంపిక చేసి వారు శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 20న నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పాల్గొంటారని కొండయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ గుంటూరు జిల్లా సెక్రటరీ ప్రతాపరెడ్డి, నరసరావుపేట జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా హనుమంతరావు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారిగా డాక్టర్ జె.హనుమంతరావు బుధవారం విధుల్లో చేరారు. డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న డాక్టర్ సుమయఖాన్‌ను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆమెపై ఫిర్యాదులు రావడం, పరిపాలనా పరమైన తప్పిదాలు చేసినట్లు ఆరోపణలు రావడంతో కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావుకు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావుకు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం విధుల్లో చేరారు. ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా విధుల్లో చేరిన డాక్టర్ హనుమంతరావును పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

జీజీహెచ్ అభివృద్ధికి ఎల్లప్పుడూ చేయూత

ఎన్నారై వైద్యుడు డాక్టర్ పాదిల ప్రసాద్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థి, అమెరికాలో స్థిరపడి గుంటూరు జీజీహెచ్ పాదిల ప్రసాద్ భవన నిర్మాణానికి రూ. 5 కోట్లు విరాళం అందజేసినట్లు డాక్టర్ పాదిల ప్రసాద్ అన్నారు. బుధవారం జీజీహెచ్‌లోని డాక్టర్ పాదిల ప్రసాద్ బ్లాక్, నాట్కో క్యాన్సర్ సెంటర్, నిర్మాణ పనులు జరుగుతున్న మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రానికి విరాళం అందజేసిన డాక్టర్ పాదిల ప్రసాద్ త్వరలో జింఖానా పాదిల ప్రసాద్ భవనంపై అంతస్తు నిర్మించేందుకు సైతం తనవంతు సహాయం అందిస్తానన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగానికి పలు వైద్య పరికరాలు ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి డాక్టర్ పాదిల ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా మణి

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీఎస్ మణి (పల్నాడు), ప్రధాన కార్యదర్శిగా బి.కాశీ విశ్వేశ్వరరావు (అనకాపల్లి) ఎన్నికయ్యారు. గుంటూరులోని జెడ్పీహాల్లో మంగళవారం జరిగిన రాష్ట్ర సంఘ సమావేశంలో భాగంగా రాష్ట్రశాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీవీఎస్ మణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె. సుధాకరరెడ్డి, కేవీవీపీ సత్యనారాయణ, ఎం.భారతిలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌పీసీ విద్యాసాగర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎ.సత్యనారాయణరెడ్డి, ఐ.గోపాల్‌రెడ్డి, పి.కస్తూరిబాయి, ఆర్.రామకొండలరావుతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులుగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాగరాజు వ్యవహరించారు.